నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 20 డిసెంబర్ 2023 | KHAMMAM

# పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు
- ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించిన తెల్లం

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, డిసెంబర్ 19 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించామని, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గుర్తు చేశారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల ఆస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులను పరామర్శించారు. అనంతరం ఆప్తమాలజీ విభాగాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ కంటి వైద్యం ఖరీదైనదని, పేదలు అంత ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేరనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మందికి కళ్ల జోళ్లు అందజేశారన్నారు. కాగా.. గతంలో రెండేళ్లపాటు ఎమ్మెల్యే వెంకట్రావు భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసి.. ఎన్నో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసి ఎంతో మంది ప్రాణాలు నిలిపారు. డాక్టర్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన డాక్టర్ వెంకట్రావుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ పుష్పగుచ్ఛం అందజేయగా.. నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కంటి వైద్యులు, గైనకాలజిస్ట్‌ను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి.. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లు, సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నక్కా ప్రసాద్, తాళ్లపల్లి రమేశ్ గౌడ్, నర్రా రాము, ఎండీ నవాబ్, ఆర్ఎంవో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ సుమన్, డాక్టర్ విజయారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ భవాని, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలకు పెద్దదిక్కునవుతా..

- పారదర్శక పాలనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల వరకే పార్టీలు అని, నియోజకవర్గ ప్రజలందరికీ పెద్దదిక్కులా ఉంటానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా, డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు పారదర్శక పాలనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. నియోజకవర్గం ఎక్కువగా ఏజెన్సీలో ఉన్నదని, రిజిస్ట్రేషన్ ప్రాంతం తక్కువగా ఉండడం వల్ల చాలామంది ఇండ్లు నిర్మించుకోలేక పోతున్నారని అన్నా రు. కొత్తగూడెం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అధికారులు సేవ చేస్తే ప్రజలకు గుర్తుండి పోవాలన్నారు. గతంలో తాను టూరిజం హోటల్ మంజూరుకు కృషి చేశానని, పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్లను పూర్తిచేస్తానని అన్నారు. సుజాతనగర్ మండలంలో ఒక పరిశ్రమ, పాల్వంచలో ఐటీ హబ్ ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వారానికి ఒక రోజు క్యాంపు కార్యాలయంలో 'మీ కోసం– మీ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు సోనా, శాంతి, ఆర్డీవో శిరీష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న జిల్లా అధికారులు

# చెట్లతోనే మానవ మనుగడ

పద్మశ్రీ వనజీవి రామయ్య

వనజీవి రామయ్యను సన్మానిస్తున్న ఫారెస్టు ఆఫీసర్లు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 19 : చెట్లతోనే యావత్ మానవ మనుగడ ఆధారపడి ఉన్నదని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని పద్మశ్రీ దరిపెల్లి(వనజీవి) రామయ్య అన్నారు. మంగళవారం ఫారెస్టు అకాడమీ 34 బ్యాచ్ బీట్ ఆఫీసర్ల సమావేశం హైదరాబాద్ దూలపల్లిలో జరిగింది. కార్యక్రమానికి పద్మశ్రీ రామయ్యను ఆహ్వానించిన సంబంధిత శాఖ అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ జీవకోటికి చెట్లు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు అకాడమీ హైదరబాద్ కోర్స్ డైరెక్టర్ ఉమ, ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పీ.సురేశ్ కుమార్, బీట్ ఆఫీసర్ ఎం.హరికృష్ణతోపాటు మరో 49 మంది ట్రెయినీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# డైట్ @ సీవోఈ

- రాష్ట్రంలో కేంద్రం ఎంపిక చేసిన రెండు కళాశాలల్లో ఖమ్మం జిల్లా విద్యా శిక్షణ సంస్థ ఒకటి
- కాలేజీకి రానున్న కొత్త కోర్సులు.. సమకూరనున్న అధునాతన సౌకర్యాలు, వసతులు
- ప్రతిపాదనలు రూపొందించిన ప్రభుత్వ ఇంజినీరింగ్ అధికారులు

ఖమ్మం డైట్ కళాశాల

ఖమ్మం, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం డైట్ కళాశాల ఇక నుంచి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మారనున్నది. డిజిటల్ సదుపాయాలతో ల్యాబ్‌లు, సెమినార్ హాళ్లు ఏర్పడనున్నాయి. ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు అన్ని రకాలుగా శిక్షణ కల్పించేలా తీర్చిదిద్దనున్నారు. దీంతోపాటు అధునాతన సౌకర్యాలు కూడా సమకూరనున్నాయి. ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర విద్యా శాఖ రాష్ట్రంలో రెండు డైట్ కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపిక చేయగా.. అందులో ఒకటి ఖమ్మం డైట్ కళాశాల ఉండడం విశేషం. ఖమ్మం డైట్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపిక చేయడంతోపాటు వసతులు కల్పించేందుకు రూ.8 కోట్ల నిధులను కేంద్ర విద్యా శాఖ కేటాయించనున్నది.

### కళాశాల నేపథ్యం ఇదీ..

జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్–డైట్) ఖమ్మంలో 10 ఎకరాలు సువిశాల ప్రాంగణంలో 1989లో ప్రారంభమైంది. 1989 నుంచి 2000 వరకు డీఈడీ కోర్సు ఏడాది కాల వ్యవధితో ఉండేది. 2000 సంవత్సరం నుంచి డీఈడీ కోర్సును రెండేళ్ల కోర్సుగా మార్పులు చేశారు. ప్రథమ సంవత్సరంలో వంద సీట్లు, ద్వితీయ సంవత్సరంలో వంద సీట్లు కేటాయించేవారు. 2015 నుంచి తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో డీఈడీని అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని శిక్షణ కార్యక్రమాలు ఈ డైట్ కళాశాల కేంద్రంగానే నిర్వహిస్తున్నారు.

### సీవోఈతో కొత్త కోర్సులు

ప్రస్తుతం డైట్‌లో డీఈడీ కోర్సు మాత్రమే నిర్వహిస్తుండగా.. ఇకపై సీవోఈతో డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సు కూడా రానున్నది. దీని ఆధారంగా అంగన్‌వాడీ పిల్లలకు, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు బోధించేందుకు అవసరమైన టీచర్లు సిద్ధమవుతారు. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు కూడా అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిక్షణ కోసం కూడా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

### రూ.8 కోట్లతో అధునాతన సౌకర్యాలు..

కళాశాలకు రూ.8 కోట్లతో అధునాతన సౌకర్యాలు కల్పించనున్నారు. 300 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియాన్ని నిర్మిస్తారు. డిజిటల్ సదుపాయాలతో సెమినార్ హాళ్లు, లెక్చర్ హాళ్లు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, మ్యాథ్స్, ఇంగ్లిష్, తెలుగు ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, సోలార్ ప్యానెల్స్ వంటి వాటిని అందుబాటులోకి తెస్తారు. ప్రిన్సిపాల్‌కు, సిబ్బందికి క్వార్టర్స్, కళాశాలకు రక్షణగా చుట్టూ 10 అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మిస్తారు. ఇంటర్నల్ రోడ్లు, బాలబాలికలకు వేర్వరు వసతి గృహాలు నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించారు.

### పరిశీలించిన అంశాలు..

డైట్ కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లుగా గుర్తించేందుకు డైట్ కళాశాలల్లో ఉన్న అన్ని అంశాలను ఎస్సీఈఆర్‌టీ అధికారులు పరిశీలించారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో గల 10 డైట్ కళాశాలలను పరిశీలించి.. వాటిల్లో ప్రధానంగా డీఈడీ విద్యార్థుల ఐదేళ్ల ఫలితాలు, కళాశాలలో జరిగిన శిక్షణలు, డీఈడీ శిక్షణలో విద్యార్థులు ఉత్తీర్ణతా శాతాలు, కళాశాల పరిసరాల పరిశుభ్రత వంటివి పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థుల ర్యాంపు, డిజిటల్ లైబ్రరీ, కళాశాల వెబ్‌సైట్, కంప్యూటర్ ల్యాబ్, స్టాఫ్ వంటి అంశాలపై నివేదికలు, ఫొటోల రూపంలో అక్టోబర్‌లోనే కేంద్ర విద్యాశాఖకు సమర్పించారు. వీటితోపాటు హాస్టల్ నిర్వహణ, బాలికలు వేచి ఉండే గది వంటి వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. కళాశాల వివరాలన్నీ కేంద్రానికి పంపించారు. నవంబర్‌లో ప్రిన్సిపాళ్ల మీటింగ్ నిర్వహించి కళాశాలల పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కళాశాలకు సంబంధించిన మరింత సమాచారాన్ని డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ నుంచి ఎస్సీఈఆర్‌టీ ప్రొఫెసర్ సేకరించారు. నిర్దేశిత 100 పాయింట్లకుగాను ఖమ్మం డైట్ కళాశాలకు 79 పాయింట్స్ వచ్చాయి. దీంతో ఈ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ)గా గుర్తించారు.

### ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

ఖమ్మం డైట్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపిక చేయడం గర్వకారణం. ఇప్పటికే ఏటా ఉపాధ్యాయులకు అన్ని రకాల శిక్షణలు ఇస్తున్నాం. సీవోఈగా ఎంపికైన ఈ కళాశాలను రాష్ట్రంలో ఆదర్శ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతాం. ఉపాధ్యాయులకు తొలిమెట్టు, ఉన్నతి, ప్రధానోపాధ్యాయులకు లీడర్‌షిప్ అంశాలపై శిక్షణ కల్పిస్తున్నాం. వీటితోపాటు నూతన కోర్సులు, మరిన్ని సౌకర్యాలు సమకూరనున్నాయి.

**–సామినేని సత్యనారాయణ, డైట్ ప్రిన్సిపాల్, ఖమ్మం**

# కోదండ రాముడిగా...

**నిజరూపంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య**

**స్వామివారిని దర్శించుకొని పరవశించిన భక్తులు**

భద్రాచలం: కోదండ రాముడిని పల్లకీలో ఊరేగిస్తున్న ఆలయ అధికారులు, భక్తులు

భద్రాచలం, డిసెంబర్19 : భద్రాద్రి దివ్య క్షేత్రంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు మంగళవారం ఏడో రోజుకు చేరాయి. దశావతారాల్లో భాగంగా స్వామివారు నిజరూప రాముడిగా దర్శనమివ్వడంతో భక్తులు పరవశించిపోయారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు, నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో అభిషేక తిరుమంజనం జరిపారు. అనంతరం స్వామివారిని అంతరాలయంలోకి తీసుకెళ్లి భక్త రామదాసు.. రామయ్యకు, సీతమ్మ తల్లికి, లక్ష్మణ స్వామివారికి తయారు చేయించిన దివ్యాభరణాలను ధరింపజేశారు. స్వామివారిని రామావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారిని బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపారు. ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి నేతృత్వంలో ఆచార్య, బ్రహ్మ ఋత్విక్‌లు నాళాయిర ప్రబంధంలోని 200 పాశురాలను అధ్యయనం చేశారు. తర్వాత స్వామివారిని అంతరాలయంలోనికి తీసుకెళ్లి రాజభోగం నివేదన చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారిని సమస్త మంగళ వాయిద్యాలు, వేద ఘోషలతో, కోలాట నృత్యాల నడుమ మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. భక్తులు తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారిని మిథిలా స్టేడియం నుంచి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు. రామయ్యకు అరటి పండ్లు, కొబ్బరి కాయలు, హారతులు సమర్పించారు. కాగా.. బుధవారం స్వామివారు బలరామునిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

### పర్ణశాల రామయ్య...

పర్ణశాల: రామావతారంలో పర్ణశాల రామయ్య

పర్ణశాల, డిసెంబర్ 19 : పర్ణశాల ఆలయంలో జరుగుతున్న ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నిజరూప అవతారంలో పర్ణశాల రామయ్య భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యగ్రహ బాధలు ఉన్న వారు స్వామివారి అవతారాన్ని దర్శించుకున్నట్లయితే విముక్తి పొందుతారని అర్చకులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారి నిజస్వరూపమైన రామావతారంలో ఉన్న ఉత్సవ మూర్తులను వైభవంగా మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్ చార్యులు, భరద్వాజ్ చార్యులు, అమరవాది శ్రీకాంత్ చార్యులు, నరసింహాచార్యులు, రాజగోపాలాచార్యులు, ఏఈవో శ్రావణ్‌కుమార్, అనిల్, సూపరింటెండెంట్ కిశోర్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

### పెద్దమ్మగుడి షాపులకు వేలం

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 19 : పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి ఆలయంలో ఇటీవల నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సులు, రెండు ఫంక్షన్ హాళ్లకు మంగళవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. రెండు ఫంక్షన్ హాళ్లు, నాలుగు షాపుల వేలంపాట ద్వారా ఆలయానికి రూ.75,48,100 ఆదాయం లభించింది. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు భేల్‌సింగ్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహీపతి రామలింగం, ఈవో రజనీకుమారి, ధర్మకర్తలు పాల్గొన్నారు. బుధవారం ఆలయ హుండీ లెక్కింపు జరుగనున్నట్లు ఈవో తెలిపారు.

### జేఏ పోస్టులు తాత్కాలిక నిలిపివేత

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 19 : సింగరేణిలో ఎక్స్‌టర్నల్ అభ్యర్థులతో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా.. 117 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను తాత్కాలికంగా నిలిపివేశారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, మెడికల్ టెస్టులు పూర్తి చేసి విధుల్లో చేరాలని నియామక పత్రాలు కూడా అందించారు. సింగరేణిలో ఈ నెల 27వ తేదీన జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల కోడ్ ఉన్నందున నిలిపివేసినట్లు తెలుస్తోంది.

### ఆస్తుల పరిరక్షణకు సహకరించండి

**ఖమ్మం సీపీకి సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వినతి**

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 19 : సింగరేణి ఆస్తుల పరిరక్షణకు సహాయ సహకారాలు అందించాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌ను కోరారు. మంగళవారం కమిషనరేట్‌కు వచ్చిన ఆయన సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో గల సోలార్ ప్లాంట్ గురించి వివరించారు. అంతేకాక జిల్లాలో గల సింగరేణి ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. దీనికి పోలీస్ కమిషనర్ సానుకూలంగా స్పందించడంతోపాటు వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఇంటెలిజెన్స్ గార్డు సాంబయ్య, కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ కిశోర్ పాల్గొన్నారు.

### హంస వాహనానికి ట్రయల్ రన్

హంస వాహనానికి ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

భద్రాచలం, డిసెంబర్19 : భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 22న సీతారామ, లక్ష్మణ మూర్తులు సర్వాలంకృతమైన హంస వాహనంపై జల విహారం చేయనున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆర్డీవో మంగీలాల్, ఏఎస్పీ పరితోశ్ పంకజ్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఈఈ రవీందర్ రాజు, పట్టణ సీఐ నాగరాజ్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు హంస వాహనానికి ట్రయల్ రన్ నిర్వహించారు. అలాగే 23న స్వామివారికి ఉత్తర ద్వార దర్శనం వైభవోపేతంగా నిర్వహించనున్నారు.

### పెద్దమ్మతల్లికి ఎస్పీ దంపతుల పూజలు

పూజలు చేస్తున్న ఎస్పీ వినీత్ దంపతులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 19 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం శ్రీకనకదుర్గ అమ్మవారిని ఎస్పీ వినీత్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి శేష, వస్త్ర, ప్రసాదాలను అందించారు. ఈవో రజనీకుమారి పాల్గొన్నారు.

### ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపిక

విద్యార్థి గణేశ్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 19 : ఈ నెల 18న వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన చదరంగం పోటీలో స్థానిక ప్రియదర్శిని కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణేశ్ యూనివర్సిటీలో ప్రథమ స్థానంలో నిలిచి ఆలిండియా యూనివర్సిటీకి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నయీంపాషా గణేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాశిమళ్ల రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 'స్థానికులకు అవకాశం కల్పించాలి'

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 19 : సింగరేణి సంస్థలో ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు, వివిధ డిపార్ట్‌మెంట్‌ల్లో కాంట్రాక్టు పనులను దక్కించుకున్న గుత్తేదారు స్థానికులకు 80శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని డైరెక్టర్(పా) ఎన్.బలరాం సర్క్యులర్ జారీ చేశారు. ఓసీల్లో ఓబీ, సెక్యూరిటీ, ఫారెస్టు తోపాటు వివిధ డిపార్ట్‌మెంట్‌ల్లో కాంట్రాక్టు కార్మికులుగా స్థానికులతో భర్తీ చేయాలని అన్ని ఏరియాల జీఎంలను ఆదేశించారు.

# సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలేవి?

**పార్లమెంటు సమావేశాల్లో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు**

పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబర్ 19: దేశంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు క్రమంగా డిమాండ్ పెరుగుతున్నందున కేంద్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని, సహజ వ్యవసాయాన్ని ఏ విధంగా ప్రోత్సహిస్తోందో రాష్ట్రాల వారీగా వివరాలు తెలియజేయాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు గడిచిన మూడేళ్లలో మంజూరు చేసిన, వినియోగించిన నిధుల వివరాలను కూడా వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. సహజ వ్యవసాయంలో నిమగ్నమైన రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకుందో చెప్పాలని కోరారు. కాగా, ఎంపీ నామా ప్రశ్నలకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా సమాధానమిచ్చారు. సేంద్రియ వ్యవసాయానికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా పరంపరగత్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) ప్రారంభించామని, 2015–16 నుంచి దేశంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. కాగా, రాష్ట్రాల వారీగా కేంద్రం సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీ నామా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, డిసెంబర్ 19 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 231 కేంద్రాలను ప్రతిపాదించి.. మంగళవారం నాటికి 226 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 93 కేంద్రాల్లో ఇప్పటివరకు 18505.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు రైస్ మిల్లుల తనిఖీలు చేపట్టి సీఎంఆర్ ఎంత? ఇతరాలు ఎంతమేర ఉన్నాయనేది చూడాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించాలన్నారు. ఏ దశలోనూ కొనుగోళ్లలో ఆలస్యం చేయొద్దని, కొన్న ధాన్యం నమోదులు పూర్తి చేసి వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆయన తెలిపారు. వోబీఎంఎస్ నమోదులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది ఇదే సమయంలో ఎంతమేర సేకరించింది.. ఇప్పుడు ఎంత సేకరించింది పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి విజయకుమారి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీం, అదనపు డీఆర్డీవో జయశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

# చేపల పెంపకంతో లాభాలు

**సీనియర్ శాస్త్రవేత్త శ్యాంప్రసాద్**

చేపల ఉత్పత్తులపై పుస్తకాన్ని విడుదల చేసిన శాస్త్రవేత్తలు

కూసుమంచి, డిసెంబర్ 19 : రైతులు చేపల పెంపకంతో లాభాలు గడించవచ్చని, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ చేపల చెరువులు విరివిగా వేసుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. పాలేరులోని పీవీ నర్సింహారావు పశు, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని చేపల పెంపకం కేంద్రంలో మూడు రోజులపాటు తెలంగాణలోని ఏడు జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో శ్యాంప్రసాద్ మాట్లాడారు. రైతులు చేపల పెంపకానికి ముందుకొస్తే వారికి కలిగే లాభాలు, చేపల ఉత్పత్తుల అమ్మకాలు, మార్కెటింగ్, వాటికి వచ్చే వ్యాధులను క్షేత్రస్థాయిలో పరిశీలించి శిక్షణ ఇస్తామని తెలిపారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ జీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపలు తినడం వల్ల ఆరోగ్